

దేవెగౌడ కుటుంబంపై ఫ్లెక్సీ.. అడ్డుకున్న జేడీఎస్ నేతలు


బెంగళూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దేవెగౌడ కుటుంబం మైసూరులో భూకబ్జాలకు పాల్పడిందని కాంగ్రెస్ పార్టీ శుక్రవారం ఏర్పాటు చేసిన సత్యమేవజయతే సభాంగణంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం వివాదానికి దా రితీసింది. మహారాజ కళాశాల మైదానం పరిసరాలలో బీజేపీ-జేడీఎస్ నేతలను ల క్ష్యం చేసుకుని కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. దేవెగౌడ కుటుంబం పై భూకబ్జా ఫ్లెక్సీలను నిరసిస్తూ మాజీ మంత్రి, జేడీఎస్ నేత సా రా మహేశ్ నే తృత్వంలో ఆందోళనకు దిగారు. అనంతరం జేడీఎస్ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు.

పాదయాత్రలకు బెదరను



సమావేశం ప్రారంభంలో సీఎం, డీసీఎం, మంత్రులు

- బడుగులకు అధికారాన్ని మతతత్వవాదులు సహించలేరు
- బీజేపీ, జేడీఎస్ నాపై కుట్ర పన్నాయి
- మైసూరు 'సత్యమేవ జయతే'లో సీఎం సిద్దరామయ్య



సిద్దరామయ్య, డీకే శివకుమార్ అభివాదం



హాజరైన ప్రజలు

బెంగళూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, జేడీఎస్ తనపై కుట్రలు పన్నుతున్నాయని, వారి పాదయాత్రలకు బెదిరేది లేదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్పష్టం చేశారు. బడుగువర్గాలకు అధికారాన్ని మతతత్వవాదులు సహించలేకున్నారని ఆయన మండిపడ్డారు. ముడాలో అక్రమాల కారకుడు సీఎం సిద్దరామయ్య రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో బీజేపీ, జేడీఎస్ చేపట్టిన చలో మైసూరు పాదయాత్రకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ జనాందోళన సభలు నిర్వహిస్తోంది. ముగింపులో భాగంగా శుక్రవారం మైసూరు నగరం మహారాజ కళాశాల మైదానంలో సత్యమేవ జయతే పేరిట బహిరంగసభ నిర్వహించింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా, డీసీఎం డీకే శివకుమార్ సహా మంత్రులు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు. భారీగా హాజరైన కార్యకర్తలు, ప్రజలను ఉద్దేశించి సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ ప్రజలే ప్రభుత్వ సైన్యం అన్నారు. రాజ్యాంగం, సామాజిక న్యాయం, ప్రజాప్రభుత్వ రక్షణకు అండగా నిలిచిన ప్రజలందికీ ధన్యవాదాలు అన్నారు. గతంలో దేవరాజ్ అరసు, బంగారప్ప సీఎంగా కొనసాగడాన్ని సహించలేదని, ప్రస్తుతం తనను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. జేడీఎస్‌కు చెందిన దేవెగౌడ, కుమారస్వామి మాట తప్పడంలో నేర్పరులని చెప్పారు. బీజేపీతో కలసి ప్రభుత్వ ఏర్పాటు అంటే తన శవంపై సాగాలని దేవెగౌడ అన్నారని గుర్తుచేశారు. మోదీ ప్రధాని అయితే దేశం వీడుతానని చెప్పారని, ప్రస్తుతం వారితోనే కలసి ప్రభుత్వం నడుపుతున్నారని విమర్శించారు. ప్రజల ఆశీస్సులతో రెండుసార్లు సీఎం అయ్యానని తెలిపారు. 1983లో రాజకీయాలు ప్రారంభించానని, ఎన్నికల్లో డిపాజిట్‌కు తన ఆఫీస్ క్లర్క్ చెల్లించారని పేర్కొన్నారు. బీసీ వర్గాల్లో దేవరాజ్ అరసు తర్వాత ఐదేళ్ల పాలన నడిపింది తానే అన్నారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతి బయటకు రాగానే సిట్ ఏర్పాటు చేశామన్నారు. రూ.50కోట్లు రికవరీ చేశారని, రూ.46 కోట్లు బ్యాంకులో ఫ్రీజ్ చేశారని వివరించారు. సిట్ సమంజసంగా దర్యాప్తు చేస్తున్నా బ్యాంకు అధికారుల ఫిర్యాదుతో ఈడీ రంగంలోకి దిగిందన్నారు. ముడా అక్రమాలపై బీజేపీ, జేడీఎస్ పనిగట్టుకుని తనను టార్గెట్ చేశాయన్నారు. ఎన్నో పదవుల్లో కొనసాగినా ముడా భూముల విషయంలో తాను లేఖ రాయలేదని, ఒక్క సంతకం కూడా చేయలేదన్నారు. తాను సీఎంగా రెండుసార్లు ప్రమాణం చేశానని, దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నా ఎప్పుడూ తన భార్య ఎక్కడా కనిపించలేదన్నారు. ఆమె పేరిట రాజకీయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సందర్భంగా ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ కుమారస్వామి క్లీన్ అంటూ చెప్పుకొంటారని, ఆయనపై 50 డీ నోటిఫికేషన్ వివాదాలు ఉన్నాయని ఇటీవలే అధికారుల ద్వారా తెలిసిందన్నారు. అన్నింటినీ బయటకు తీస్తానని అన్నారు. కుమారస్వామి గనులకు కేటాయించిన భూమి విషయమై లోకాయుక్త విచారణ జరిపేలా గవర్నర్‌కు లేఖ రాసినా స్పందన లేదన్నారు. యడియూరప్ప రెండుసార్లు ఎందుకు రాజీనామా చేశారని ప్రశ్నించారు. లక్ష్మీ విలాస్ బ్యాంకు నుంచి విదేశాలకు ఆర్‌టీజీఎస్ ఎందుకు చేశారని ప్రశ్నించారు. కుమారస్వామి ప్రజ్వల్ పెన్‌డ్రైవ్ వివాదంలో తనపై ఆరోపణలు చేశారని, ఆ తర్వాత ప్రీతంగౌడపై విరుచుకు పడుతున్నారని గుర్తు చేశారు. కుమారస్వామి కాంగ్రెస్ పార్టీని ఏమీ చేయలేడని అన్నారు. కుమారస్వామి సారథ్యంలో జేడీఎస్ గెలిచింది 19 సీట్లు మాత్రమేనని, తన సారథ్యంలో కాంగ్రెస్ గెలిచింది 136 సీట్లు అన్నారు. ప్రజల ఆశీర్వాదం ఉండేంతవరకు ఇలాంటి కుట్రలు ఏమీ చేయలేవన్నారు. సుర్జేవాలా మాట్లాడుతూ పవిత్రమైన కర్ణాటకలో కలుషిత రాజకీయాలు పెరిగాయని తెలిపారు. పేదలు, వెనుకబడిన వర్గాల ప్రజలకు గ్యారెంటీల ద్వారా న్యాయం చేస్తున్న సిద్దరామయ్య ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. మంత్రులు జార్జ్, సతీశ్‌జార్కిహోళి, మహదేవప్ప, జమీర్ అహ్మద్, పరమేశ్వర్, ఎంబీ పాటిల్, మునియప్ప, బోసరాజు, వెంకటేశ్, భైరతి సురేశ్, హెచ్‌కే పాటిల్, ఈశ్వర్‌ఖండ్రె, రెహమాన్‌ఖాన్ సహా ఎమ్మెల్యేలు, మైసూరు రీజియన్‌కు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



మల్లేశ్వరంలో నాగదేవతలకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

రాష్ట్రమంతా నాగపంచమి పూజలు

బెంగళూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం శుక్ల పంచమిని పురస్కరించుకుని రాష్ట్రమంతటా నాగపంచమి పూజలు నిర్వహించారు. అశ్వత్థకట్టలు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలతోపాటు నాగదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. నాగదేవతలకు పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లేశ్వరం, మావళ్లి, జయనగర్, చామరాజపేటతోపాటు వివిధ ప్రాంతాల్లో నాగులకు పూజలు చేసేందుకు పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చారు. ప్రత్యేకించి కుక్కె సుబ్రహ్మణ్య, ఘాటి సుబ్రహ్మణ్య, విదురాశ్వత్థంతోపాటు కోటిలింగాల వద్ద ప్రత్యేక పూజలు కొనసాగాయి.

విదురాశ్వత్థంలో ...





వేదికపై సాహితీవేత్తలు

యువతలో సాహిత్యాభిలాష పెరగాలి

- భావవ్యక్తీకరణకు భంగం కలుగుతోంది
- ప్రముఖ సాహితీవేత్త హెచ్‌ఎస్ శివప్రకాశ్
- ఆడంబరంగా బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్‌కు శ్రీకారం

బెంగళూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): యువతలో సాహిత్య అభిలాష పెరగాల్సి ఉందని ప్రముఖ సాహితీవేత్త హెచ్‌ఎస్ శివప్రకాశ్ తెలిపారు. బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్ (బీబీఎల్ఎఫ్)-2024 ను శుక్రవారం ప్రారంభించారు. ఏటా బుక్ బ్రహ్మ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈసారి దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అన్ని భాషలను మమేకం చేశారు. మూడు రోజుల సాహిత్య జాతర ఆడరంబంగా ప్రారంభమైంది. దక్షిణాది భాషల ప్రముఖ కవుల ద్వారా ఉత్సవ్‌కు శ్రీకారం చుట్టారు. రచయితలు సచ్చిదానందన్, జయమోహన్, ఓల్గా, వివేక్ శాన్‌భోగ్ వంటి సాహితీ దిగ్గజాలు భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా శివప్రకాశ్ మాట్లాడుతూ ఎనిమిదో శతాబ్దంలోనే కన్నడ సాహిత్యం ప్రారంభమయిందని తెలిపారు. సమాజంలో జరిగే ప్రతి అంశం కవిత, రచనల రూపంలో విస్తారమైందన్నారు. ఆదికవి పంపతో కన్నడకు మరింత ప్రాధాన్యత వచ్చిందని తెలిపారు. ప్రపంచీకరణతో మనసులోని భావాలను నేరుగా వ్యక్తం చేసే అవకాశం తగ్గుతోందన్నారు. ఈ ప్రభావం పుస్తకపఠనంపైనా ఉంటుందన్నారు. సచ్చిదానందన్ మాట్లాడుతూ దక్షిణాది భాషలకు వేలాది సంవత్సరాల చరిత్ర ఉందని వివరించారు. కన్నడలో వచన సాహిత్యం నేటికీ కొనసాగడం సంతోషకరమన్నారు. దక్షిణాది భాషలన్నింటినీ ఒక వేదికపైకి తీసుకురావడాన్ని సాదరంగా స్వాగతిస్తున్నా అన్నారు. రాష్ట్రానికో భాష ఉన్నా ప్రాంతాలవారీగా విభిన్నమైన భాషలు మాట్లాడుతున్నారని తెలిపారు. తెలుగు రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ వందేళ్ల క్రితం మద్రాస్ కేంద్రంగా ప్రచురణలు సాగేవని, తెలుగు, తమిళ సాహితీవేత్తలు, రచయితలు అక్కడే ఎక్కువగా ఉండేవారని తెలిపారు. బెంగాలీ నుంచి తెలుగు అనువాదం ఉండేదని, తెలుగు నుంచి ఇతర భాషలకు అనువాదం చాలా తక్కువే అన్నారు. మద్రాస్‌లో ప్రముఖ తెలుగు పండితుడు వావిళ్ల రామస్వామి పంతులుకు చెందిన పబ్లికేషన్స్ ప్రముఖంగా ఉండేదన్నారు. అప్పట్లో పెరియార్ ప్రభావం కూడా అధికంగా ఉండేదన్నారు. 1960 దశకంలో రష్యన్, అమెరికన్, బ్రిటీష్ భాషల నుంచి తెలుగులోకి అనువాదాలు జరిగాయని గుర్తుచేశారు. సరోజినీనాయుడి సోదరుడు హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ కూడా ఎన్నో రచనలు చేశారని తెలిపారు. ప్రస్తుతం కాస్మోపాలిటన్ నగరాలలో నాలుగు ప్రధాన భాషలైన తెలుగు, కన్నడ, తమిళ, మళయాళ సాహిత్యం ఎలా ఉందనేది ఈ వేదిక ద్వారా చర్చించదలిచామని తెలిపారు. జయమోహన్ మాట్లాడుతూ మాతృభాష ఏదైనా పలు కారణాలతో పొరుగు రాష్ట్రాల్లో స్థిరపడిన కారణంగా అక్కడి భాషపై మక్కువతో సాహిత్యంలో రాణించినవారు ఎందరో ఉన్నారన్నారు. అందులో తాను ఒక్కడినని, మళయాళం మాతృభాష అయినా తమిళంలో రాణించినట్లు తెలిపారు. మరో సాహితీవేత్త వివేక్‌శాన్‌భోగ్ మాట్లాడుతూ ఇటీవలికాలంలో పలు కారణాలతో నగరాలకు వలస వచ్చేవారి సంఖ్య పెరిగిందని, గ్రామీణ ప్రాంతాల వారితో పోలిస్తే పట్టణాలు నగరాల వారిలో సాహితీ అభిలాష తక్కువ అన్నారు. మరో వేదికపై ప్రముఖ కవి హంపా నాగరాజయ్య నేతృత్వంలో పాలి - కన్నడ శబ్దకోశ పుస్తకాన్ని ఆవిష్కరించారు. బుక్‌బ్రహ్మ డైరెక్టర్ సతీశ్ చప్పరికె స్వాగతోపన్యాసం చేస్తూ.. సాహితీ ఉత్సవం సరిహద్దులు దాటి దక్షిణభారత భాషల సంప్రదాయాలు, వైవిధ్యం ఆచరించే వేడుకగా మారిందని కొనియాడారు. సాహిత్య సంబరం అందరికీ చేరిందని, తాము కార్యాచరణ మాత్రమే చేస్తున్నామని అన్నారు. సౌత్ ఆఫ్ సోల్ పేరిట ఏర్పాటు చేసిన ఉత్సవంలో ప్రముఖ రచయిత పెరుమాళ్ మురుగన్ విజేతలను ప్రకటించారు. సాయంత్రం సమీక్షలో పెరుమాళ్, మురుగన్, గోపాలకృష్ణన్, పావణ్ణన్ చర్చాగోష్ఠి ఆకట్టుకుంది. పెద్దసంఖ్యలో ఏర్పాటైన స్టాల్స్‌ను పలువురు సందర్శించి ఆసక్తిగా కొనుగోలు చేశారు.

నేటి సాహిత్య ఉత్సవ్‌లో...

శనివారం ఉదయం 8.30 నుంచి 10 గంటల దాకా మెలోడీ గాయనం కొనసాగుతుంది. 10 గంటలకు దక్షిణాది భాషలపై ప్రశ్నోత్తరాలు అనే అంశంపై చర్చ ఉంటుంది. 11 గంటల నుంచి 12.50 వరకు 'మీడియాలో సాహిత్యం సంస్కృతి' అనే అంశంపై ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, డెక్కన్ హెరాల్డ్ రామకృష్ణన్, మళయాళం మాతృభూమి ముఖ్యులు మయూర్ శ్రేయం కుమార్, హిందూ ముఖ్యులు భాగేశ్రీ పాల్గొంటున్నారు. తర్వాత 'తమిళ దళిత సాహిత్యం - సాధనలు సవాళ్లు' అనే అంశంపైనా చర్చాగోష్ఠి ఉంటుంది. 3 గంటలకు తెలుగులో స్త్రీల ఆత్మకథలు, 4 గంటలకు కన్నడ సాహిత్యం జాగదీకరణ అనే అంశంపై చర్చాగోష్ఠి ఉంటాయి. ఐదు వేదికల ద్వారా కార్యక్రమాలుంటాయి.



శబ్దకోశాన్ని ఆవిష్కరిస్తున్న హంపా నాగరాజయ్య



బుక్‌బ్రహ్మ ఫెస్టివల్‌లో ఏర్పాటైన స్టాల్స్

మాది ప్రజాపోరాటం

- కాంగ్రెస్ వారిది అధికారం కోసం ఆరాటం
- మండిపడ్డ ప్రతిపక్షనేత అశోక్

బెంగళూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల ప్రజాధనం లూటీపై బీజేపీ ప్రజా పోరాటం చేస్తోందని, అధికార కాంగ్రెస్ వాటిని కప్పిపుచ్చుకునేందుకు, నాయకత్వ మార్పునకు భంగం కలగకుండా ఆరాట పడుతోందని ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. శుక్రవారం పాదయాత్ర శ్రీరంగపట్టణ నుంచి ప్రారంభమైంది. సాయంత్రానికి మైసూరు శివారుకు చేరుకుంది. ఈ సందర్భంగా మండ్యలో ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ తాము దొంగలు కాదు నమ్మండి అని చెప్పుకొనేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. అధికార కాంగ్రెస్ నిజాయితీగా వ్యవహరించి ఉంటే శాసన సభలో రికార్డులను సమర్పించి చర్చలు జరిపి పారదర్శకతను ప్రదర్శించాల్సి ఉండేదన్నారు. ఒకరోజు ముందే కార్యకలాపాలను ముగించారన్నారు. తాము ప్రతిపక్షంలో ఉంటూ పోరాటాలు చేస్తున్నామని, వారు పడుతున్న ఆరాటానికి అంతులేకుండా పోతోందన్నారు. రోజూ జనాందోళన పేరిట తమకంటే ముందే సభలు జరుపుతున్నారని, వాటికోసం మంత్రులను ఇన్‌చార్జ్ చేసి ప్రజలను తరలిస్తున్నారని ఆరోపించారు. కేంద్రం నుంచి గ్రాంట్లలో మోసం జరిగిందని చెప్పే కాంగ్రెస్ నేతలకు ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ సమగ్ర వివరాలు అందించారని గుర్తుచేశారు. మన్మోహన్‌సింగ్ పదేళ్ల పాలనకు, నరేంద్రమోదీ పాలనలో ఎంత మేర రాష్ట్రానికి నిధులు వచ్చాయనేది పోల్చాలని తెలిపారు. రాజ్యసభలో కాంగ్రెస్ పక్ష కీలకనేతగా వ్యవహరిస్తున్న మల్లికార్జున ఖర్గే రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ఎందుకు స్పందించడం లేదన్నారు. పాదయాత్రతో వేలాదిమంది కార్యకర్తలలో చైతన్యం నింపామని అన్నారు. కాంగ్రెస్ అక్రమాలను వెలుగులోకి తెచ్చామని చెప్పారు. అధికార పార్టీ అక్రమాలు, అవినీతి, పక్షపాతం ఏ స్థాయిలో ఉన్నాయో వివరించామన్నారు. చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా సిద్దరామయ్య కుటుంబికులు స్థలాలు పొంది ఉంటే 2014లో ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో కోట్లాది రూపాయలు ఎవరికీ తెలియకుండానే హైదరాబాద్‌లోని ప్రైవేట్ బ్యాంకు ఖాతాలకు ఎలా చేరాయని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ గ్రాంట్లలో రూ. 25వేల కోట్లకు పైగా గ్యారెంటీలకు ఖర్చు చేశారని ఆరోపించారు. బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, వెనుకబడి, కులాలకు ప్రత్యేక కార్పొరేషన్‌ల ద్వారా గ్రాంట్లు కేటాయించేది వారి అభివృద్ధి కోసమే అనేది గుర్తెరగాలన్నారు. పాదయాత్రలో బెళగావి ఎంపీ జగదీశ్ శెట్టర్ ముఖ్యులుగా పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, మాజీ మంత్రి అశ్వత్థనారాయణ, సీటీ రవి సహా పలువురు పాల్గొన్నారు. కొడగుతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పాదయాత్రలో టెంకాయలతో ప్రత్యేకంగా చేసిన గజమాలతో స్వాగతం పలికారు.



మీడియాతో ప్రతిపక్షనేత అశోక్

నేడు పాదయాత్ర ముగింపు

మైసూరు శివారు ప్రాంతానికి చేరుకున్న పాదయాత్ర శనివారంతో ముగియనుంది. ఆరేడు కిలోమీటర్ల మేర నడక సాగిస్తే మహారాజ మైదానానికి చేరుకుంటారు. ముగింపు సభకు బీజేపీ, జేడీఎస్ అగ్రనేతలు పాల్గొంటారు.



పాదయాత్రలో సందడి ఇలా..



పాదయాత్రలో బీజేపీ ముఖ్యనేతలు



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు


	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.73	1,628.33
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	45,086	28,997
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	31,831	9,165
సామర్థ్యం (టీఎంసీలు)	104.70	87.92

110 టీఎంసీల టీబీడ్యాం నీరు నదిలోకి

● సమాంతర కాలువ నిర్మాణానికి 1985లోనే ప్రతిపాదనలు

● వరద నీరు వృథా కాకుండా ప్రణాళిక రూపొందిస్తే ఏపీ, కర్ణాటక రాష్ట్రాల రైతులకు ఎంతో ఉపయోగం

● వెంటనే చర్యలు తీసుకోవాలంటున్న ఇంజనీయర్లు



బళ్లారి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నది వరదతో పొంగిపొర్లుతోంది. వర్షాలు కురిసి వంకలు పారుతున్నప్పుడు ఆ నీటిని సక్రమంగా వినియోగించుకుంటే పొలాలకు సమృద్ధిగా నీరందిి పంటలు పండుతాయి. ఆ వరదనీటిని వినియోగించుకోకుంటే భవిష్యత్తు అంధకారమేనని నిపుణులు అంటున్నారు. కానీ తుంగభద్ర వరదనీటిని వినియోగించుకోవడంతో కర్ణాటక, ఆంధ్రరాష్ట్రాలు విఫలమయ్యాయని చెప్పవచ్చు. దీంతో ఈ ఏడాది జూలై-ఆగస్టు నెలల్లో ఏకంగా 110 టీఎంసీల వరదనీరు నదిపాలయింది.

1985లో మొదటగా ఉమ్మడి ఏపీప్రభుత్వం వరద కాలువ ప్రతిపాదన చేసింది. తుంగభద్ర డ్యాం వద్ద ఎగువ కాలువకు సమాంతరంగా మరో కాలువ నిర్మాణం చేసి వరద నీరు పారే సమయంలో ఆ నీటిని వరద కాలువకు మళ్లించి వినియోగించుకుంటామని ఏపీ ప్రభుత్వం నివేదించింది. ఇదే తరహాలో కర్ణాటక కూడా వరద నీటి వినియోగం కోసం నవలి వద్ద 20 టీఎంసీల సామర్థ్యంతో నీటి నిల్వ ప్రాజెక్టును ప్రతిపాదించింది. అయితే కర్ణాటక ప్రభుత్వం దీనిపై స్పష్టంగా ఏమీ చెప్పలేదు.

తుంగభద్ర డ్యాం నిర్మాణం జరిగి సుమారు 70 ఏళ్ల గడిచింది. వర్షాలు బాగా కురిసి డ్యాం నిండిన ప్రతిసారి సరాసరి 200 నుండి 300 టీఎంసీల నీరు నదిపాలు అయిందని బోర్డు రికార్డుల ద్వారా తెలుస్తోంది. నవలి వద్ద రిజర్వాయర్ డీపీఆర్ కోసం రూ 15,601 కోట్లు కర్ణాటక ప్రభుత్వం మంజూరు చేసింది. దీని ప్రకారం 7500 హెక్టార్ల భూమిని సేకరించి అక్కడ ప్రాజెక్టు నిర్మాణానికి కర్ణాటక ప్రభుత్వ తీర్మానించింది. అయితే అది ప్రతిపాదనలకే పరిమితమయింది. తుంగభద్ర డ్యాం నిర్మాణం 1953లో పూర్తయింది. రిజర్వాయర్‌లో ఏడాదికి 0.45 టీఎంసీ ల మేర పూడికపేరుకుంటోంది. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 28 టీఎంసీల మేర పూడిక పేరుకుంది. ఈ కారణంగా నీటినిల్వ సామర్థ్యం 133 టీఎంసీల నుండి 105 టీఎంసీలకు చేరుకుంది. వాస్తవానికి డ్యాంలో పూడిక తీయడం అంత సులభం కాదు. ఒక టీఎంసీ మట్టి తరలించాలంటే కోట్లాది రూపాయలు వ్యయం అవుతుంది. ఇంత వరకూ నీటి ప్రాజెక్టుల్లో పూడిక తీసిన సందర్భాలు దేశంలో ఎక్కడా జరగలేదు. వాస్తవానికి ఒక ప్రాజెక్టు నిర్మాణం చేసే ముందే డ్యాం వల్ల కలిగే లాభనష్టాలు, మన్నిక ఉపయోగం, లాంటి అన్ని అంశాలతో పాటూ నీటి ద్వారా చేరే పూడికను ఏంచేయాలనే విషయాన్ని కూడా అంచనా వేస్తారు. అప్పుడు ప్రాజెక్టును డిజైన్ చేసిన ఇంజనీయర్లు పూడికపై స్పష్టంగా చెప్పారు. అనుకున్నట్లే ప్రస్తుతం తుంగభ్ర డ్యాంలో పూడిక పెరిగింది. అయితే పూడిక తీయడం సాధ్యం కాదని నిపుణులే పేర్కొన్నారు. కాకపోతే వరద సమాంతర కాలువ నిర్మాణం జరిగితే ప్రత్యామ్నాయంగా నీరు నదికి పోకుండా వినియోగించుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

వరదనీటి పారుదల సమయంలో నదీ పరివాహక ప్రాంతాలకు, అలాగే నది జలాలతో జీవనం సాగించే పశుపక్ష్యాదులకు, రైతులకు ఎంత అవసరమో అంత నీరు వదలి మిగిలిన నీటిని వినియోగించుకుంటే కర్ణాటక, ఆంధ్ర రైతులకు ఉపయోగ కరంగా ఉంటుందని నిపుణులు పేర్కొన్నారు. 2023లో పెద్దగా వర్షాలు కురవక నదికి నీరు పారలేదు, అంతకు ముందు అంటే 2022లో సుమారు 200 టీఎంసీలు, 2021లో 300 టీఎంసీలు, 2024లో ఇప్పటికి 110 టీఎంసీల నీరు నదికి మళ్లించారని బోర్డు వర్గాలు తెలిపాయి. నదికి వృథాగా వెళ్లే నీటి వినియోగం కోసం ఏపీ ప్రభుత్వం తుంగభద్ర ఎగువ కాలువకు సమాంతరంగా వరద కాలువ, అలాగే కర్నాటక ప్రభుత్వం నదిలో పారే నీటి నిల్వకు గంగావతి తాలూకా నవలి వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి అంగీకారం తెలిపితే ఇందుకు కేంద్ర నీటిపారుదల శాఖ కూడా అంగీకరించే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

ఘనంగా శ్రావణ శుక్రవారం వేడుకలు



నూతన వస్త్రాలను సమర్పిస్తున్న కరస్పాండెంట్ గాంధీ

బళ్లారి సిటీ ఆగస్టు 9: బళ్లారి నగరంలోని శ్రీ నంద పాఠశాలలో శ్రావణ శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారతీయ సంప్రదాయం ప్రకారం స్త్రీమూర్తులకు పసుపు కుంకుమతో పాటు నూతన వస్త్రాలను పాఠశాల కరస్పాండెంట్ గాంధీ సమర్పించారు. అలాగే 10వ తరగతి విద్యార్థు తల్లిదండ్రులు, పోషకులకు పాద పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటారు. గ్రామాల నుండి వచ్చిన వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి హరికుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలని వినతి

సిరుగుప్ప, ఆగస్టు 9 : బలకుంది గ్రామ పంచాయతీలోని గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని బీజేపీ బీసీ మోర్చా అధ్యక్షుడు కోరి సిద్దయ్య తెలిపారు. సిరుగుప్ప తాలుకా పరిధిలోని బలకుంది. ఉప్పర హోసళ్లి, మైలాపుర గ్రామాల ప్రజలు తాగునీరులేక అలమటిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఉప్పరహోసళ్లిలో వుండే తాగునీటి చెరువుకు వేసవి కాలంలో కాలువల ద్వారా నీరు మళ్లించకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. ప్రస్తుతం కాలువలకు నీరు వదిలి 16 రోజులు గడిచినా ఇప్పటివరకు చెరువుకు నీరు మళ్లించకపోవడంతో తాగునీటి సమస్య నెలకొందన్నారు. చాలాసార్లు తెలిపినా అధికారులు పట్టించుకోవడం లేదని, తక్షణం ఈ విషయంపై స్పందించకపోతే గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా చేపడతామన్నారు.

దళితుల బడ్జెట్‌ను వారికే వినియోగించాలి



వినతిపత్రం ఇస్తున్న దళిత హక్కుల సమితి అధ్యక్షులు ఈరణ్ణ

సిరుగుప్ప, ఆగస్టు 9 : రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో దళితులకు కేటాయించిన నిధులను ఇతర పథకాలకు ఉపయోగించుకోవడం దురదృష్టకరమని దళిత హక్కుల సమితి అధ్యక్షులు ఈరణ్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరుగుప్ప పట్టణంలో శుక్రవారం దళితహక్కుల సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల నిధులను దళితులకే అందేలా చూడాలని డిమాండ్‌చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధి, సంక్షేమంపై దృష్టిసారించాలని కోరారు. ఈ సందర్భంగా దళిత హక్కుల సమితి పదాధికారులు ఓబుళేశప్ప, యర్రిస్వామి, తిప్పయ్య, నాగరాజు, బసవరాజు, లక్ష్మణ్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా శంకరబండ రోడ్డు



బురదలో వెళుతున్న వాహనాలు

బళ్లారిరూరల్, ఆగస్టు 9 : తాలుకాలోని రూపనగుడి శంకరబండ రోడ్డు అధ్వానస్థితిలోకి మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డులో వాహన రాకపోకలు ఎక్కువగావున్నా ఈ రహదారిని పట్టించుకునే నాథుడేలేడని వాహనదారులు వాపో తున్నారు. బైక్‌పై ఈ రోడ్డులో వెళ్లాలంటే బురదలో స్కిడ్ అయ్యి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ రోడ్డును మరమ్మతు చేయడానికి చర్యలు తీసుకోవాలని ద్విచక్రవాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా ప్రముఖుల జయంతి

● ముందస్తు సమావేశంలో ఏడీసీ జుబేరా సూచన



మాట్లాడుతున్న ఏడీసీ మహ్మద్ జుబేరా

బళ్లారి సిటీ, ఆగస్టు 9: జిల్లా కేంద్రంలో ప్రముఖుల జయంతి కార్యక్రమాలను అర్థవంతంగా నిర్వహించాలని అదనపు డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేరా తెలిపారు. నగరంలోని జిల్లా పాలనా మందిరంలో శుక్రవారం వివిధ ప్రముఖుల జయంతి వేడుకలకు సంబంధించి జరిగిన ముందస్తు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కన్నడ సాంస్కృతిక శాఖ తరపున ఆగస్టు 19న నులి చందయ్య జయంతి, 20న బ్రహ్మశ్రీ నారాయణగురు జయంతి, 26న శ్రీకృష్ణ జయంతి కార్యక్రమాలను అర్థవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అన్ని సంఘాల సభ్యులు, సంఘాల నాయకులు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నులి చంద్రయ్య జయంతిలో భాగంగా ఆగస్టు 19న బెంకిమారెమ్మ (బండిమోట్) దేవాలయం నుంచి బ్రూస్‌పేట పోలీస్ స్టేషన్ మీదుగా ర్యాలీ నిర్వహించాలన్నారు. డాక్టర్ జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో వేదిక కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఆగస్టు 26న డా.జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో శ్రీకృష్ణజయంతిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖులను ఆహ్వానించాలన్నారు. ఈసందర్భంగా తాగునీటి ఏర్పాట్లు, పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ కార్పోరేషన్ అధికారులకు సూచించారు. వేదిక కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌చే ప్రత్యేక ఉపన్యాసం ఏర్పాటు చేయాలని, అనంతరం తేలికపాటి భోజనం ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈసందర్భంగా కన్నడసాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజుతో పాటు వివిధ శాఖల అధికారులు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్‌రైలు

● బెళగావి - హుబ్లి మార్గంలో రైళ్ళ దారి మళ్లింపు

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 9: బెళగావి - హుబ్లి రైలు మార్గంలో శుక్రవారం ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. దూద్ సాగర్, సొనాలి స్టేషన్ల మధ్య బొగ్గును తీసుకెళుతున్న ఈ గూడ్స్ రైలుకు చెందిన 11 బోగీలు పట్టాలు తప్పినట్లు నైరుతి రైల్వే అధికారులు ప్రకటించారు. గోవాలోని వాస్కోడాగామా నుంచి హొసపేట మీదుగా బళ్ళారి జిల్లాలోని జిందాల్ ఉక్కు కర్మాగారానికి బొగ్గును తీసుకొస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని నైరుతి రైల్వే ముఖ్య అధికారి మంజునాథ్ మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో రైలు నెం 17420/17022 వాస్కోడగామా - తిరుపతి/ హైదరాబాద్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలు రైళ్ళ రాకపోకల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయని పేర్కొన్నారు. ఆ మార్గంలో సంచరించాల్సిన రైళ్ళను దారిమళ్లించి మడగాంవ్, కారవార, పడీల్, సుబ్రమ్మణ్య రోడ్, హాసన, అరిసికెర, చిక్కజాజూర్, రాయదుర్గం మీదుగా నడవనున్నట్లు తెలిపారు. రైలు నెంబరు 12799 వాస్కోడగామా - హజరత్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్‌ను అన్నుమడగావ్, రోహా, పన్వెల్, కళ్యాణ, పుణే మార్గం గుండా నడుపుతుండగా, రైలు నెంబరు 12780 హజరత్ నిజాముద్దీన్ - వాస్కోడాగామా ఎక్స్‌ప్రెస్‌ను పూణె, పన్వల్, రోహ మడగావ్ మీదుగా నడుపుతున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



దూద్‌సాగర్ - సోనాలిం స్టేషన్ల మధ్య పట్టాలుతప్పిన గూడ్స్ రైలుబోగీలు

చోరీకి గురైన బ్యాటరీ ఇన్వర్టర్ స్వాధీనం



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బ్యాటరీలు

బళ్లారి రూరల్, ఆగస్టు 9 : బళ్లారి గాంధీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. విచారణలో వారు బళ్లారి రేణుకనగర్‌కు చెందిన రవి ఈశ్వర్, హనుమంతులుగా తేలింది. తాము గత కొద్దిరోజులుగా మూసివేసిన షాపుల్లో పలుచోరీలకు పాల్పడినట్టు తెలిపారు. గాంధీనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిద్దం ఎస్పీ ఆదేశాలతో వారిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 92వేలు విలువ గల బ్యాటరీలు, ఇన్వర్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి రిమాండ్‌కి పంపినట్లు గాంధీనగర్ పోలీసులు తెలిపారు.

నగరసభ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం




చికిత్స పొందుతున్న ఉద్యోగి

రాయచూరు, ఆగస్టు 9 : నగరసభ విద్యుత్ విభాగంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అఫ్సర్ అలి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు శుక్రవారం ఆయనను నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స నందిస్తున్నారు. ఉద్యోగి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో సదర్‌బజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. నగరసభలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న అఫ్సర్ అలికి గడచిన ఏడు నెలలుగా వేతనం అందకపోవడంతో కుటుంబ నిర్వహణ భారంగా మారింది. ఈ క్రమంలో అనేక సార్లు కమిషనర్‌ను కలిసి వేతనం కోసం అభ్యర్థించినా ఫలితం లేకపోవడంతో మానసిక వేదనకు గురైన ఆయన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు.

జలపాతాన్ని తలపిస్తున్న కెంచనగుడ్డ

బళ్లారి సిటీ, ఆగస్టు 9: బళ్లారి జిల్లా సిరుగుప్ప తాలూకాలోని కెంచనగుడ్డ సమీపంలో విజయనగర రాజులు వ్యవసాయానికి నీరు అందించేందుకు నిర్మించిన స్టోరేజీ ట్యాంకులపైనుంచి తుంగభద్ర నది జలపాతంలా ఉప్పొంగుతోంది. చూసేవారికి అది పాల నురుగులా కనిపిస్తుంది. తుంగభద్ర జలాశయం నుంచి 1.40 లక్షల క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేయడంతో కెంచనగుడ్డలో జలపాతాలు ఏర్పడ్డాయి. పవర్‌ప్లాంట్‌కు నీటిని సరఫరా చేయడానికి నిర్మించిన కాలువ ప్లాంట్‌భవనం ఎడమ వైపున జలపాతంలా ప్రవహిస్తోంది. ఈసుందర దృశ్యాన్ని చూసేందుకు జనం తరలివస్తున్నారు. దేశనూర్ డ్యామ్‌లో గోకాక్ జలపాతం తరహాలో ఉప్పొంగుతున్న ఈ నీటి దృశ్యం కన్నులపండువగా ఉంటుంది. ఇక్కడి సహజసిద్ధమైన రాళ్లలో సహజ సిద్ధంగా నిర్మించిన జలపాతాల అందాలను తిలకించడానికి వందలాది మంది పర్యాటకులు ఇక్కడికి వస్తున్నారు. సిరుగుప్ప నుండి 6కిమీ దూరంలో ఉన్న కెంచనగుడ్డకు ఆటో, బస్సు సర్వీసులు ఉన్నాయి. సుమారు 2కిమీ నడవాల్సి ఉంటుంది. నదికి వెళ్లేందుకు రవాణా వ్యవస్థ లేదు. వాహన సౌకర్యం ఉన్నవారు నది దగ్గరకు వెళ్లవచ్చు. ఇక్కడ నీటిలోతు ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తు జారిపోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. వర్షాకాలంలో తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం పెరిగినప్పుడు ఇక్కడి ప్రజలు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తారు. నదిలో స్నానం చేసి పూజలు చేసి ఇంటి నుంచి తెచ్చిన ఆహారాన్ని ఆస్వాదిస్తూ నది అందాలను తిలకిస్తారు.



పరవళ్లు తొక్కుతున్న నీటి ప్రవాహం

కార్పొరేట్ కంపెనీలు దేశం విడిచి వెళ్లాలి

ఏఐకేకేఎంఎస్ డిమాండ్

బళ్లారి సిటీ, ఆగస్టు 9: కార్పొరేట్ కంపెనీలు దేశం విడిచి వెళ్లాలంటూ సంయుక్త కిసాన్ మోర్చా శుక్రవారం గడిగి చెన్నప్ప సర్కిల్లో ఆందోళనకు (ఏఐకేకేఎంఎస్) దిగింది. ఈసందర్భంగా ఏఐకేకేఎంఎస్ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు గోవింద్, రాష్ట్ర రైతు సంఘం హరిత సేన జిల్లా అధ్యక్షుడు సంగనకల్లు కృష్ణప్ప, కర్ణాటక పీపుల్స్ పవర్ తరఫున వసంత్ కాలే మాట్లాడుతూ ప్రజలకు చెందాల్సిన సంపదను దోచుకుంటున్న కార్పొరేట్ కంపెనీలను తరిమికొట్టేందుకు దేశవ్యాప్తంగా పెద్దఎత్తున పోరాటం జరపాలన్నారు. నేడు ఏ పార్టీలు అధికారంలోకి వచ్చినా ఈ పెట్టుబడిదారులకు అనుకూలంగా విధానాలను అమలుచేస్తూ సామాన్యుల జీవితాలను దుర్భరం చేస్తున్నాయన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, భారతదేశ వ్యవసాయ ఉత్పత్తి, మార్కెటింగ్, నిల్వ, పంపిణీని నియంత్రించాలన్నారు. వ్యవసాయ భూమిని రైతుల వద్ద ఉంచి, కాపాడాలన్నారు. ప్రపంచ వాణిజ్య ఒప్పందం నుండి వ్యవసాయ ఉత్పత్తిని మినహాయించాలన్నారు. ఈసందర్భంగా ఏఐకేకేఎంఎస్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురళ్ళి రాజ, ద్యావణ్ణ, జిల్లాసభ్యుడు అప్పాజీ, హొన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.



గడిగిచెన్నప్ప సర్కిల్లో ఆందోళన చేస్తున్న ఏఐకేకేఎంఎస్ నేతలు

సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి



నంబర్ టెన్ ముద్దాపురంలో మాట్లాడుతున్న పంచాయతీ ఈవో

కంప్లి, ఆగస్టు 9 : గ్రామాల్లో వుండే ప్రజలు ప్రతి ఒక్కరు పంచాయతీ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఈవో శ్రీకుమార్ తెలిపారు. తాలుకాలో నెంబర్ 10 ముద్దాపురం గ్రామ పంచాయతీలో ఏర్పాటుచేసిన సౌకర్యాల గురించి ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సభ్యులు ఐక్యంగా వున్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పథకాలు కూడా ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లన్నగౌడ, అధ్యక్షురాలు సోమేశ్వరి, ఉపాధ్యక్షురాలు సావిత్రమ్మ, పీడీవో శిల్పారాణి, కార్యదర్శి వీరభద్ర గౌడ, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

క్రిమినల్ కోడ్ సవరణ చట్టాల కాపీల దహనం



కేంద్ర ప్రభుత్వం విధానాలను ఖండిస్తూ నిరసన

హోసూరు ఆగస్టు 9: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన మూడు చట్ట సవరణలకు వ్యతిరేకంగా హోసూరు కోర్టు సముదాయం ఎదుట శుక్రవారం ఆ చట్టాల కాపీలను సీపీఐ సభ్యులు దహనంచేసి నిరసన తెలిపారు. ప్రదర్శనకు రాష్ట్ర కమిటీ సభ్యులు మత్తయ్య నాయకత్వం వహించారు. నిరసనలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లగుమయ్య ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన మూడు కొత్త శిక్షాస్మృతి సవరణాల పత్రాలను దహనం చేసి భారత కమ్యూనిష్టు పార్టీ నిరసన తెలిపిందన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం ఈ మూడు క్రిమినల్ చట్టాలను ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఆదిల్‌నూర్, శంకరయ్య, చిన్నస్వామి తదితర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. దీంతో అక్కడ భద్రత కోసం ఉన్న పోలీసులు వారిని అడ్డుకోవడంతో తోపులాట జరిగింది.

పొదుపు ప్రణాళికపై అవగాహన ర్యాలీ

హోసూరు ఆగస్టు 9 : హోసూరు ఇండియన్ బ్యాంక్ శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంకణీకోట రోడ్డులోని ఇండియన్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ నుంచి ర్యాలీ ప్రారంభమై రీజినల్ ఆఫీస్ రోడ్, ఫార్మర్స్ మార్కెట్ రోడ్, రాయకోట హడ్కో పెరియార్ నగర్, రైల్వేస్టేషన్ రోడ్డు మీదుగా ఇండియన్ బ్యాంకు బ్రాంచ్ వద్ద ముగిసింది. వారు పట్టుకున్న బ్యానర్లలో అన్ని ఇండియన్ బ్యాంకు శాఖల్లో డిపాజిట్లపై వడ్డీరేట్లను ప్రస్తావించారు. ఇండియన్‌బ్యాంక్ మేనేజర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ 400రోజుల డిపాజిట్‌కు 7.25 శాతం వడ్డీ ఇస్తున్నట్టు పేర్కొన్నారు.

వైభవంగా ముత్తుమారియమ్మ ఉత్సవాల నిర్వహణ



ఊరేగింపుగా పాలబిందెలతో వెళ్తున్న భక్తులు

హోసూరు(సిప్‌కాట్) ఆగస్టు 9 : హోసూరు మారుతీ నగర్ ప్రాంతంలో గల శ్రీ ముత్తుమారియమ్మన్ ఆలయంలో ధ్వజారోహణ, శ్రీ విఘ్నేశ్వర పూజ, మహాసంకల్పం, పుణ్యాహోమం, పంచకావ్య పూజలు, మహావాస్తు పూజ, గత 31 నుంచి జరిగాయి. 1వ తేది నుంచి గణపతి హోమం, శ్రీ విఘ్నేశ్వర పూజలు, ఇలా వివిధ పూజా కార్యక్రమాలు జరిగాయి. శ్రీ చిత్తల దేవి హోమం నిర్వహించారు. ఆ తర్వాత నది నుంచి దేవతను తీసుకువచ్చి మూల విరాట్‌కు పూజలు నిర్వహించారు. మహా అభిషేకం అనంతరం అలంకారం నిర్వహించి గురువారం పుట్టింటి వాయనాలు అందించారు. హోసూరు శ్రీ కోట మారియమ్మ ఆలయం వరకు శక్తి కరగం, పాల బిందెలు, అగ్నికుండ లు, పసుపు బిందెలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తాదులందరికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఇండియన్ బ్యాంక్ శాఖల ఆధ్వర్యంలో అవగాహనర్యాలీ

కొడుకు కోసం మాజీ సైనికుడి రోదన

● నారాయణపూర్ కాల్వలో యువకుడి గల్లంతు ● పట్టించుకోని పోలీసులు



తేజస్వి(ఫైల్)

రాయచూరు, ఆగస్టు 9: జిల్లా సరిహద్దులోని నారాయణపూర్ క్రాస్ వద్ద నారాయణపూర్ కుడి కాలువలో ఇటీవల గల్లంతైన ఓ యువకుడి కోసం అతడి తల్లిదండ్రులు రోదిస్తున్నారు. లింగసుగూరు పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో నివాసముంటున్న మాజీ సైనికుడి కుమారుడు తేజస్వి(22) బీఈ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. అతడు తన మిత్రుడితో కలిసి మూడురోజుల క్రితం నారాయణపూర్ క్రాస్ వద్దగల కాలువ వద్దకు వెళ్లాడు. ముఖం కడుక్కునేందుకు కాలువలోకి దిగే క్రమంలో ఒక్కసారిగా కాలుజారి అందులోకి పడిపోయాడు. ప్రవాహం ఎక్కువ కావడంతో గల్లంతయ్యాడు. ఈ విషయాన్ని వెంటనే అక్కడికి సమీప పోలీస్ స్టేషన్‌లోకి పిర్యాదు చేసేందుకు వెళ్లగా.. ఆ కాలువ తమ పరిధిలోకి రాదంటూ ఇతర పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలని అక్కడి పోలీసులు సూచించారు. అక్కడికి వెళ్లగా యువకుడు జారిపడిన ఆ కాలువ ప్రదేశం తమ పరిధిలోకి కూడా రాదంటూ రెండవ పోలీసు స్టేషన్‌వారు కూడా తప్పించుకున్నారు. పోలీసులు ఇలా పరస్పరం కాలాయాపన చేస్తుండడంతో పుత్రుడి ఆచూకీ లభించక మాజీ సైనికుడు కాలువ వద్ద మూడు రోజులుగా పడిగాపులు కాస్తుండటం అందరినీ కలిచివేస్తోంది. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని ఆయన విన్నవిస్తున్నారు. దేశ రక్షణ కోసం సరిహద్దులో దీర్ఘకాలం పాటు సేవలందించిన తాను పుత్రుడి కోసం పడిగాపులు పడుతున్నానని ఆ రిటైర్డ్ ఆర్మీ జవాన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతు వ్యతిరేక విధానాల పై నిరసన




దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న రైతులు

రాయచూరు, ఆగస్టు 9 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను కిసాన్ సంయుక్త మోర్చా నాయకులు తీవ్రంగా ప్రతిఘటించారు. ఇందుకు నిరసనగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో శుక్రవారం కార్పొరేట్ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కిసాన్ సంయుక్త మోర్చా సంఘాల నాయకులు కనీస మద్దతు ధర చట్టాన్ని వెంటనే పార్లమెంట్ ఆమోదించాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో రైతు వ్యతిరేక విధానాల కోసం సిద్ధం చేసిన బిల్లులను వెంటను ఉపసంహరించుకోవాలని కోరారు. అనంతరం జిల్లాధికారి కార్యాలయం ఎదురుగా టిప్పుసుల్తాన్ గార్డన్‌లో నిరసన ప్రదర్శన చేసిన రైతు సంఘం నాయకులు అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కౌంచ్...

వీవీ గిరి (జయంతి)



'భారతరత్న' పురస్కార గ్రహీత వరాహగిరి వేంకట గిరి (వీవీ గిరి) 1894 ఆగస్టు 10న ఒడిశా రాష్ట్రం బెర్హంపూర్‌లో తెలుగు మాట్లాడే కుటుంబంలో జన్మించారు. దేశనాల్గవ రాష్ట్రపతిగా 1969 నుంచి 1974వరకు వ్యవహరించారు. ఇంత వరకు స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికైన ఏకైక రాష్ట్రపతి ఆయనే. కాగా మహాత్మాగాంధీజీ పిలుపుతో సహాయ నిరాకరణోద్యమంలోనూ, స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొన్నారు. పరిశ్రమలు, కార్మికుల సమస్యలపై పలు పుస్తకాలు రాశారు. ఆయన జ్ఞాపకాలతో 'మై లైఫ్ అండ్ టైమ్స్' పేరిట పుస్తకం విడుదలైంది. 1980 జూన్ 24న కన్నుమూశారు.

శంకరంబాడి సుందరాచారి (జయంతి)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రగీతమైన 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ...' రచించిన శంకరంబాడి సుందరాచారి 1914 ఆగస్టు 10న తిరుపతిలో జన్మించారు. ఆయన మాతృభాష తమిళం. గొప్ప కవి, పద్య కవిత్వం ఆయన ప్రత్యేకత. తేటగీతిలో ఎన్నో పద్యాలు రాశారు. మహాత్మాగాంధీ హత్య జరిగినప్పుడు ఆవేదనతో 'బలిదానం' అనే కావ్యం రాశారు. రవీంద్రుని 'గీతాంజలి'ని అనువాదం చేశారు. ఏకలవ్యుడు అనే ఖండకావ్యం, కెరటాలు అనే గ్రంథం, ఇతర రచనలు, సినిమాలకు పాటలు రాశారు. 1977 ఏప్రిల్ 8న పరమపదించారు. ఆయన జ్ఞాపకార్థం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరుచానూరులో కాంస్యవిగ్రహం ఏర్పాటు చేసింది.

జువాన్ మాన్యుయెల్ స్యాంటోస్ (పుట్టినరోజు)



నోబెల్ శాంతి పురస్కార గ్రహీత జువాన్ మాన్యుయెల్ స్యాంటోస్ 1951 ఆగస్టు 10న జన్మించారు. కొలంబియా దేశ రాజకీయనేత. 2010 నుంచి 2018 వరకు కొలంబియా దేశ అధ్యక్షుడిగా వ్యవహరించారు. 'సోషల్ పార్టీ నేషనల్ యూనిటీ' సహ సంస్థాపకులు. 2016లో నోబెల్ అవార్డు అందుకున్నారు. వృత్తిరీత్యా ఆర్థికవేత్త, వ్యాపారరీత్యా జర్నలిస్టు. ఇంటర్ అమెరికన్ డైలాగ్స్ డిస్టింగ్విష్డ్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్ ఫర్ పీస్, నేషనల్ జాగ్రఫిక్ సొసైటీచే హానర్, గ్లోబల్ స్టేట్స్‌మన్ అవార్డ్ ఇతరత్రా అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు.

సాయి ప్రణీత్ (పుట్టినరోజు)



భమిడిపాటి సాయి ప్రణీత్ 1992 ఆగస్టు 10న పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జన్మించారు. గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో 8వ యేటనుంచే తర్ఫీదు పొందారు. 2019లో బీడబ్ల్యుఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించారు. ప్రకాశ్ పదుకొనె తర్వాత బీడబ్ల్యుఎఫ్ వరల్డ్ ఛాంపి యన్‌షిప్‌లో 36 ఏళ్ల అనంతరం టైటిల్ సాధించి 'అర్జున' అవార్డుతో సత్కరించారు. టోక్యో ఒలిం పిక్స్‌లోనూ ప్రాతినిధ్యం వహించారు. 2024 మార్చిలో రిటైర్మెంట్ ప్రకటించారు. ప్రస్తుతం యూఎస్‌లో కోచ్‌గా కొనసాగదలిచారు.

వరమహాలక్ష్మి పండుగకు ప్రత్యేక అలంకరణలు



ఆర్ట్, క్రాఫ్ట్ మేళాను ప్రారంభిస్తున్న నటి శృతి సత్యన్

బెంగళూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వరమహాలక్ష్మి పండుగ అంటే మహిళలకు ఎంతో ఇష్టం. కొత్త డిజైన్ల చీరలు ఎంపిక చేసుకోవడంతోపాటు ఇంటిని అందంగా తీర్చడం, వ్రతం కోసం పూజా అలంకరణ సామగ్రి కొనుగోలుకు ఆసక్తి చూపుతారు. అటువంటి అన్ని వస్తువులు డిజైన్లు అందుబాటులో లభించేలా చిత్రకళా పరిషత్‌లో ఆర్ట్, క్రాఫ్ట్ మేళాను నటి శృతి సత్యన్ ఆరంభించారు. ఈ సందర్భంగా శృతి మాట్లాడుతూ వరమహాలక్ష్మి పండుగకోసం అవసరమైన వస్తువులు, వాయనం ఇచ్చేందుకు తీసుకున్నప్పుడు ఇచ్చే బహుమతులు, సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా వస్తువులు ఒకే చోట లభించడం సంతోషమన్నారు. ఈనెల 18వరకు మేళా కొనసాగుతుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శ్రావణమాస పూజలకు సిద్ధమైన పావగడ



అలంకరణలో శనేశ్వరుడు

పావగడ, ఆగస్టు 9 : శ్రావణ శనివారం సందర్భంగా పావగడ శనీశ్వరుడి ఆలయం సిద్ధమయ్యింది. భారతదేశంలో పేరుగాంచిన కర్నాటకలోని తుమకూరుజిల్లా పావగడలోని శనేశ్వరీ ఆలయం శ్రావణమాసంలో దర్శించుకుంటే సకల పాపాలు వైదొలుగుతాయన్న నమ్మకం ఇక్కడి భక్తుల అపార నమ్మకం. శనివారం ఉదయం 4.30కు జ్యేష్టాదేవి సమేతుడైన శనేశ్వరుడికి కళశపూజ, గణపతిపూజ, నవగ్రహపూజ, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, తైలాభిషేకం, కుంకుమార్చన నిర్వహిస్తామని కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్, ప్రధాన అర్చకులు సత్యనారాయణశాస్త్రి తెలిపారు.

ఘాటిలో నాగపంచమి వేడుకలు



నాగదేవతలకు పూజలు



ఘాటి ఆలయంలో ప్రాకార ఉత్సవం

దొడ్డబళ్లాపుర, ఆగస్టు 9: తాలూకాలోని ఘాటి సుబ్రమణ్య దేవాలయంలో నాగపంచమిని పురస్కరించుకుని శుక్రవారం విశేష పూజలు కొనసాగాయి. ప్రత్యేకించి సర్పదోష నివారణ పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మూలవిరాట్టుకు క్షీరాభిషేకం, నెయ్యాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రతిష్ఠించిన వందలాది నాగదేవతలకు పూజలు జరిపారు.

చేళూరులో...

చేళూరు: తాలూకా కేంద్రమైన చేళూరులో నాగపంచమి వేడుకలు భక్తిశ్రద్ధలతో సాగాయి. నాగదేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకించి ముత్తైదువులు మాంగల్య భాగ్యం కోసం పూజలు జరిపారు. తాలూకా వ్యాప్తంగా నాగపంచమిని పురస్కరించుకుని విశేషపూజలు కొనసాగాయి.



చేళూరులో పూజలు

సంస్కరించిన నీరు వద్దు.. కృష్ణా నీరు వదలండి

బాగేపల్లి, ఆగస్టు 9: వెనుకబడిన కోలారు, చిక్కబళ్ళాపుర జిల్లాలకు సంస్కరించిన నీటిని చెరువులకు మళ్లిస్తున్నారని ఇది వద్దని, కృష్ణా నది వాటా నీరు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర సమితి సభ్యుడు డాక్టర్ అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించి జిల్లాల ప్రజలకు నీటి విషయంలో న్యాయం చేయాలన్నారు. కృష్ణానది నీటివాటాలపై శాసనసభలో చర్చ జరగాలన్నారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌తో చర్చించాలన్నారు. సంస్కరించిన మురుగునీటిని జిల్లా చెరువులకు విడుదల చేయడం ద్వారా తాగు, సాగునీటికి అనుకూలం కాదన్నారు. కార్పొరేట్ కంపెనీలకు గులాంల మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇకనైనా పార్టీలకు అతీతంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముని వెంకటప్ప, సభ్యులు బిళ్ళూరు నాగరాజ్, వాల్మీకి అశ్వత్థప్ప, సావిత్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో సీపీఎం నాయకుడు అనిల్‌కుమార్ తదితరులు

ముడా స్థలాలపై బీజేపీ కుట్ర రాజకీయాలు

సీఎం సిద్ద రామయ్య కుమారుడు, ఎమ్మెల్సీ యతీంద్ర

బెంగళూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ముడా స్థలాల విషయంలో బీజేపీ తమ కుటుంబంపై కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందని సీఎం సిద్ద రామయ్య కుమారుడు, ఎమ్మెల్సీ యతీంద్ర తెలిపారు. మైసూరులో శుక్రవారం సత్యమేవ జయతే సభకు ముందు మీడియాతో మాట్లాడారు. ముడా ఇంటి స్థలాల వివాదంలో జ్యుడీషియల్ విచారణ ఆరంభమైతే స్థలాల హక్కులు తమకు ఉండవని, వాపసు ఇచ్చినట్టేనని అన్నారు. న్యాయ విచారణలో క్లీన్‌చిట్ వస్తే మాత్రమే తమకు దక్కుతాయని లేనిపక్షంలో వాపసు తీసుకోవచ్చు అన్నారు. తమ కుటుంబానికి సంబంధించిన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో సమగ్రంగా పొందుపరిచామన్నారు. బీజేపీ వారు కర్ణాటకలోనే కాకుండా దేశమంతటా అక్రమ మార్గంలో ప్రభుత్వాల ఏర్పాటుకు కుట్రలు పన్నుతున్నాయన్నారు. ముడా వివాదంలో తన తల్లిదండ్రుల మనసు బాధపడిందన్నారు. న్యాయబద్ధంగా రావాల్సిన పరిహారంలోనూ కుట్రలు చేస్తున్నారన్నారు. తన తల్లి తీవ్ర విచారం వ్యక్తం చేశారని, తన తండ్రి కోర్టులో పోరాటం చేసి సాధించుకున్నామని చెప్పారన్నారు. కేంద్రం దర్యాప్తు సంస్థల ద్వారా వ్యతిరేక పార్టీ నాయకులను అణచివేయాలనే కుతంత్రానికి పాల్పడుతోందన్నారు. 40ఏళ్ల రాజకీయంలో తన తండ్రికి ఇటువంటి చెడ్డపేరు ఎప్పుడూ రాలేదన్నారు.



యతీంద్ర సిద్ధరామయ్య

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



ఆలయంలో యూనిఫాం అందచేస్తున్న ట్రస్టు పదాధికారులు

బొమ్మనహళ్ళి, ఆగస్టు 9: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, షూలు, సాక్స్‌లను అరికెరె శాంతినికేతన్ లే అవుట్‌లోని షిర్డీసాయిబాబా దేవస్థానంలో సాయి సేవారక్షా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. యలహంకలోని శ్రీ నీలకంఠేశ్వర ప్రభుత్వ స్కూల్‌కు చెందిన విద్యార్థులకు ఆలయ ట్రస్టు నిర్వాహకులు నేరుగా పరిశీలించి 60మందికి తలా రెండుజతల యూనిఫాం సెట్‌లను అందచేశారు. ట్రస్టు అధ్యక్షుడు మేడా రామకృష్ణ నేతృత్వంలో కార్యక్రమం ఏర్పాటైంది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తొలుత బొమ్మనహళ్ళి నియోజకవర్గ పరిధిలో ట్రస్టు సామాజిక సేవలు ఉండేవని ఇటీవల బెంగళూరు గ్రామీణ ప్రాంతాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కూడా విస్తరించామన్నారు. ఇందులో భాగంగా యలహంక విద్యార్థులకు అందచేశామన్నారు. విద్యతోనే పురోగతి సాధ్యమని భావించి తమవంతు సహకారం అందిస్తున్నామన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. దాతల సహకారంతోనే ఇది సాధ్యమవుతోందన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు కార్యదర్శి తాతయ్యగుప్త, మనోహర్‌గుప్త, కృష్ణయ్యశెట్టి, వెంకటేశ్‌గుప్త, సత్యనారాయణశెట్టి, సురేశ్‌శర్మ, యలహంక పాఠశాలకు చెందిన అధ్యక్షుడు సుబ్రమణ్యం, సెక్రటరీ వెంకటనారాయణ, హెచ్ఎం రెడ్డిరాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహేశ్వరిదేవి ఆలయ కుంభాభిషేకం

శిడ్లఘట్ట, ఆగస్టు 9: పట్టణంలోని నగర్తపేటలో మోడ్రన్‌స్కూల్ సమీపాన వందలాది సంవత్సరాల పురాతన చరిత్ర కల్గిన ఆదిశక్తి మహేశ్వరమ్మ దేవి ఆలయ కుంభాభిషేకం, అమ్మవారి పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధతలతో జరిగింది. వేకువజామున అమ్మవారికి గంగపూజ, స్వస్తివాచనం, దేవనాంది, పంచగవ్య, మంటపపూజ, కుండ సంస్కార, ప్రధాన హోమం అనంతరం మహామంగళారతి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రెండు రోజులపాటు కార్యక్రమాలు సాగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎం మంజునాథ్, నగరసభ మాజీ సభ్యులు బాలకృష్ణ, శివకుమార్, రాజు, సుబ్రమణి, పట్టణ ప్రముఖులు, టీకె నాగరాజ్, రామచంద్రప్ప, పంపు నాగరాజ్, చిక్కమునియప్ప తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి విశేషపూజలు

'ప్రైవేట్ పాఠశాలలపై వేధింపులు మానుకోవాలి'

హొసకోటె, ఆగస్టు 9: ప్రైవేట్ పాఠశాలలపై పలు ఆంక్షలతో ప్రభుత్వం వేధింపు చర్యలకు పాల్పడుతోందని దీంతో ప్రైవేట్ పాఠశాలలు అడకత్తెరలో ఇరుక్కున్నట్టుగా మారాయని ప్రైవేట్ పాఠశాల విద్యాసంస్థల సంఘం దేవరాజ్ ప్రభుత్వతీరుపై ఆక్రోశం వ్యక్తం చేశారు. పట్టణంలోని వివేకానంద పాఠశాల ఆవరణలో ప్రైవేట్ పాఠశాల విద్యాసంస్థల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీసీ కెమెరాలు లేవని, ఫైర్‌సేఫ్టీ లేదని, నిర్మాణాల నాణ్యత ప్రమాణం లేవని, ప్రభుత్వ పాఠశాలలకు ఎలాంటి నియమాలు అన్వయం లేవని అయితే ప్రైవేట్ విద్యాసంస్థలకు మాత్రం ఆంక్షలు విధించడం సరికాదన్నారు. కాగా ఆగస్టు 15న బ్లాక్‌డేగా ఆచరించదలిచామన్నారు. మీడియా సమావేశంలో సంఘం అధ్యక్షుడు నాగరాజ్ గుప్తా, గౌరవాధ్యక్షుడు మునిశామేగౌడ, కార్యదర్శి భరత్‌చంద్ర, కృష్ణమూర్తి, పదాధికారులు పాల్గొన్నారు.



ప్రైవేట్ విద్యాసంస్థల సంఘం పదాధికారులు

గిరిజన ఆశ్రమ పాఠశాల భవనాలు నిర్మిస్తాం : కలెక్టర్

బుక్కరాయసముద్రం, ఆగస్టు 9: నూతన సాంకేతిక ప్రమాణాలతో ఏపీ గిరిజన ఆశ్రమ పాఠశాల భవనాలను నిర్మిస్తామని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుక్కరాయసముద్రంలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, గదుల కొరత సమస్యను ప్రిన్సిపాల్ హరిజేనాయక్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయించాలని, లేదంటే కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పాఠశాల భవనాలకు సిద్ధరాంపురం రోడ్డు వద్ద కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. భవన నిర్మాణాలకు ఖర్చు నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. డీటీడబ్ల్యూఓ రామాంజినేయులు, తహసీల్దారు పుణ్యవతి ఆయన వెంట ఉన్నారు.



బుక్కరాయసముద్రం గిరిజన పాఠశాలను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్

స్వాతంత్ర వేడుకలకు శిక్షణ

హిందూపురం అర్బన్, ఆగస్టు 9: విద్యార్థి దశ నుంచే దేశంపట్ల సమాజంపట్ల, గౌరవం, దేశభక్తి పెంపొందేలా విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం వేడులకు జిల్లా కేంద్రంలో విద్యార్థులు నిర్వహించే మార్చ్‌ఫాస్ట్‌కు స్థానిక చిన్మయా విద్యాలయంలో గత నాలుగు రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. హిందూపురం, పూలకుంట, పులమతి, మోద, లేపాక్షి జవహర్‌నవోదయ తదితర ప్రాంతాల నుంచి 150 మంది ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో గిరిదర్, నాగరాజు, బొమ్మన ప్రసాద్, మహ్మద్ ఇక్బాల్, స్కౌట్ క్యాంప్ ఆఫీసర్ రామకృష్ణ, నాగరాజు, స్కౌట్ మాస్టర్ వెంకటరామప్ప, నారాయణస్వామి, అశ్వర్థనారాయణ, మహేష్‌బాబు, చిన్మయ పీఈటీ శైలజ, రోజ, రాణి పాల్గొన్నారు.

ముగిసిన ఆర్డీటీ అథ్లెటిక్స్ పోటీలు

పెనుకొండ, ఆగస్టు 9 : ఆర్డీటీ ఆధ్వర్యంలో రూరల్ బాలికల అథ్లెటిక్స్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న హైస్కూల్ బాలికలు అండర్-14, అండర్-16 విభాగాల్లో 60, 100, 200మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, షార్ట్‌పుట్ ఈవెంట్స్‌నందు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ రాజేష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ హాజరై బహుమతులు అందజేశారు. ఆర్డీటీ సిబ్బంది సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. విజేతలైన ప్రథమ, ద్వితీయ క్రీడాకారులు అనంతపురంలో జరిగే పోటీలకు అర్హత పొందినట్లు తెలిపారు.

నేటి నుంచి శివాలయ ప్రతిష్ఠోత్సవాలు

మడకశిర రూరల్, ఆగస్టు 9 : నియోజకవర్గంలో వీరశైవ లింగాయత్ సంఘం వారి ఆధ్వర్యంలో మండలంలోని ఆమిదాగొంది గ్రామంలో నూతనంగా నిర్మించిన నూతన శివాలయ ప్రతిష్ఠ ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు వీరశైవ లింగాయత్ శివాలయ కమీటి సభ్యులు శుక్రవారం ప్రకటించారు. 10 న దేవస్థాన ప్రాంగణము నందు గంగపూజ, గోపూజ, విగ్రహాల సంప్రోక్షణం, యాగశాల ప్రవేశం, గణపతిపూజ , బిలిపీఠస్థాపనం, హోమాలు, 11 న పంచామృత, పుణ్యనదీతీర్థ స్నానం అగ్ని ప్రతిష్ఠాపన హోమములు,12 న నూతన విగ్రహములు ప్రతిష్ఠాపన, ప్రాణప్రతిష్ఠ, జయాధిహోమములు, పూర్ణాహుతి అలంకారములు, విమాన గోపురకలశ స్థాపన, కుమభాభిషేకం, ధ్వజ స్తంభపూజలు, మహామంగళహారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా ధర్మస్థళ ధార్మాధికారి డి.వీరేంద్ర హెగ్డే, రామకృష్ణ సేవా శ్రమ జపానందస్వామీజీ, ఎంపీ పార్థసారధి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి, విచ్చేయనున్నట్లు తెలిపారు.

కేంద్రమంత్రి కుమారస్వామిపై ప్రాసిక్యూషన్‌కు సిట్ వినతి

- పది నెలలుగా రాజ్‌భవన్‌లోనే పెండింగ్

బెంగళూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గనుల అక్రమాల విచారణ జరుపుతున్న లోకాయుక్త పరిధిలో సిట్ ప్రస్తుత కేంద్రమంత్రి కుమారస్వామిని ప్రాసిక్యూషన్ చేసేందుకు రాజ్‌భవన్‌కు విన్నవించింది. లోకాయుక్త ఏడీజీపీ చంద్రశేఖర్ స్వయంగా రాజ్‌భవన్‌కు 2023 నవంబరు 21న లేఖ రాశారు. సదరు వినతికి గవర్నర్ స్పందించకపోవడంపై పలు విమర్శలు జోరందుకుంటున్నాయి. శ్రీసాయి వెంకటేశ్వర మినరల్స్ అనే బోగస్ సంస్థకు ముఖ్యమంత్రి హోదాలో కుమారస్వామి 2007 అక్టోబరు 6న బళ్ళారి జిల్లా సండూరు తాలూకా బావిహళ్ళి తిమ్మప్పగుడి పరిధిలో 550 ఎకరాల భూమి గనుల తవ్వకాలకు కేటాయించారు. మినరల్స్ కన్సెషన్ నిబంధనలు ఉల్లంఘించి మంజూరు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన లోకాయుక్త సిట్ ద్వారా దర్యాప్తు చేపట్టింది. కుమారస్వామి తప్పు చేశాడని, లోకాయుక్తకు సిట్ చార్జ్‌షీట్ వేసింది. ఆ తర్వాత ఏడీజీపీ, గవర్నర్‌కు వినతిని పంపారు. కుమారస్వామిపై విచారణ చేపట్టేలా అనుమతులకు కోరారు. 9 నెలలుగా రాజ్‌భవన్ ఎటువంటి ప్రక్రియ చేపట్టలేదు. అయితే సీఎం సిద్దరామయ్య విషయంలో రాజ్‌భవన్ వెనువెంటనే స్పందించడంపై కాంగ్రెస్ వర్గాలు మండిపడుతున్నాయి.

ఇందిరా క్యాంటీన్ ఆహారానికి ఆన్‌లైన్‌లో ఆర్డర్

బెంగళూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఇందిరా క్యాంటీన్ రుచులను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసే కొత్త విధానం తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. బెంగళూరులో వార్డుకు ఒకటి ఇందిరాక్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. తగినస్థలం సౌలభ్యం లేనిచోట మొబైల్ క్యాంటీన్‌లను అందుబాటులోకి తెచ్చారు. అయితే ఇటీవల ఇందిరాక్యాంటీన్‌లు సజావుగా నడవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం డిజిటల్‌వైపు అన్ని వర్గాల ప్రజలు ఆసక్తి చూపుతున్నందున అందుకు అనుగుణంగా ఇందిరా క్యాంటీన్‌ల రుచులను అందు బాటులోకి తీసుకురాదలిచారు. అయితే స్విగ్గీ, జొమాటో తరహాలో ఆర్డర్ చేస్తే ఇంటికి తీసుకొచ్చి డెలివరీ చేసేది ఉండదు. ఇందిరాక్యాంటీన్‌లో అందుబాటులో ఉండే ఆహార పదార్థాలకోసం ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేయవచ్చు. కొంత సమయంపాటు వాటిని రిజర్వు చేసి ఉంచుతారు. ఆర్డర్ చేసిన సమయం నుంచి నిర్దిష్టగడువుదాకా రిజర్వు చేస్తారు. ఈలోగా స్పందించకుంటే ఇతరులకు విక్రయిస్తారు. ఈనెల 15నుంచి ఇందిరాక్యాంటీన్‌లలో మెనూ మార్చాలని భావిస్తున్నారు. డిజిటల్ ఆర్డర్ ప్రయోగం రాజరాజేశ్వరినగర్‌లో ప్రయోగాత్మకంగా ఆరంభించదలిచారు.

జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్ష రేసులో హరీశ్‌కుమార్

బంగారపేట, ఆగస్టు 9: కోలారు జిల్లా బంగారపేట తాలూకాలో సుమారు ఐదేళ్లుగా కాంగ్రెస్ పార్టీలో నిషావంత కార్యకర్తగా పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేశానని కోలారు జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి పోటీ పడుతున్న హరీశ్‌కుమార్ వి.జి. అభిప్రాయ పడారు. పట్టణంలో కాంగ్రెస్ భవనంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాలూకాలో ఐదేళ్లుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా ఉన్నానని, తాలూకా యూత్‌కాంగ్రెస్ కార్యదర్శిగా యువత విద్యాభ్యాసం, క్రీడలను ప్రోత్సహిస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చానన్నారు. కోలారు జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి అభ్యర్థిగా పోటీ చేస్తున్నా అని తనకు అవకాశం కల్పించాలని, ఆగస్టు 16 నుంచి సెప్టెంబరు 16 వరకు ఎన్నికలు ఉంటాయని తనను ఆశీర్వదించాలన్నారు.

కు.ని. ఆపరేషన్‌లపై అవగాహన

మహదేవపుర, ఆగస్టు 9: కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌ల ద్వారా పురుషత్వం కోల్పోతామనే తప్పుడు భావనతో పురుషులు కు.ని. శస్త్రచికిత్సలకు ముందుకు రావడం లేదని డాక్టర్ కళావతి అభిప్రాయపడ్డారు. కేఆర్‌పురలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతివారం నిర్వహించే కుని శస్త్రచికిత్స శిబిరంలో వైద్యులను, ప్రజలను సన్మానించారు. డాక్టర్ సురేంద్ర మాట్లాడుతూ కు.ని ఆపరేషన్‌ల పట్ల నెలకొన్న అపోహలను దూరం కావాల్సిన అవసరం ఉందన్నారు. సిజేరియన్ చేసుకున్న మహిళలు సైతం కుని ఆపరేషన్‌లకు సిద్ధమవుతుండగా పురుషులు మాత్రం వెనుకంజ వేస్తున్నారన్నారు. గురురాజ్ మాట్లాడుతూ వేసక్టమీ ఆపరేషన్ ఒక సవాల్‌గా మారిందన్నారు. కు.ని ఆపరేషన్‌లు చేసుకున్న పురు షులకు రూ. 1100, మహిళలకు రూ.600 ప్రోత్సాహకం ఉందన్నారు. శ్రీశైల కణ్బాల్, యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.